

ప్రభుత్వ బడులకు ట్యాబ్‌లు

కార్పొరేట్‌కు దీటుగా విద్యనందించేందుకు సర్కారు బడి కొత్త రూపు సంతరించుకుంటోంది. ఇందులో భాగంగానే ప్రభుత్వం పాఠశాలలకు ట్యాబ్‌లు అందజేస్తోంది. 10లో▸




సీతారాముల విగ్రహాలు లభ్యం

జన్నారం మండలం తపాలపూర్ అటవీ ప్రాంతంలో శుక్రవారం సీతారాముల విగ్రహాలు బయటపడ్డాయి. పంచలోహ విగ్రహాలు కనిపించడంతో బయటకు తీసి పూజలు చేశారు. 10లో▸

గరిష్టం/కనిష్టం
37.0 /25.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఈశాన్యం దిశగా వడగాలులు వీస్తాయి. గరిష్ట ఉష్ణోగ్రత స్వల్పంగా తగ్గే అవకాశం ఉంది.



వెలుగులు సరే.. ఉద్యోగాలేవి?



జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు

- జైపూర్ విద్యుత్ కేంద్రంలో మరో 800మెగావాట్ల ప్లాంటు నిర్మాణం
- ఏటేటా రూ.వేల కోట్లతో విద్యుత్ ఉత్పత్తి, అమ్మకాలతో వృద్ధి
- ప్లాంటు నిర్వాసితుల బతుకుల్లో చీకట్లు
- స్థానికులకు ఉద్యోగ కల్పనపై ప్రజాప్రతినిధులకు పట్టింపు కరువు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: భూమి.. బొగ్గు.. నీరు ఇక్కడివి. ఉద్యోగాలు మాత్రం ఇక్కడి వారికి కాదు.. ఇదీ జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులోని పరిస్థితి. రాష్ట్రంలోనే ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి ఆధ్వర్యంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ.. వెలుగులు పంచుతూ ఇక్కడి నిర్వాసితుల జీవితాల్లో చీకట్లు నింపుతోంది. జైపూర్ థర్మల్ పవర్ ప్లాంటు దినదినాభివృద్ధి చెందుతున్నా ఇక్కడి భూమిపుత్రులకు న్యాయం జరగడం లేదు. తమ ప్రాంతంలో పరిశ్రమ వస్తే బతుకులు బాగు పడుతాయని సాగు భూములను ప్లాంటు కోసం వదులుకున్నారు. నిర్వాసితులకు 80శాతం ఉద్యోగాలు కల్పిస్తామని ఒప్పందాలు సైతం చేసుకున్నారు. 2016లో ప్లాంటు ప్రారంభమైనప్పటి నుంచి నేటికీ అవేవీ అమలు కాలేదు. తాజాగా సింగరేణి మరో 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ ప్లాంటు నిర్మాణం చేపట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుతం 1200 మెగావాట్లకు మరో 800 మెగావాట్లు కలిపితే రెండు వేల మెగావాట్లు ఉత్పత్తి కానుంది. వీటికి తోడు భవిష్యత్‌లో మరో 800 మెగావాట్ల ప్లాంటు ఏర్పాటుకు పరిశీలన చేస్తోంది. సౌర విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. గత ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ అమ్మకంతో రూ.4371 కోట్ల టర్నోవర్ సాధించింది. ఏటేటా ఉత్పత్తి, లాభాలు పెరుగుతున్నాయి. కానీ స్థానికులకు ఉద్యోగాల కల్పనలో నిరాశే మిగులుతోంది.

పర్యవేక్షణకే సింగరేణి పరిమితం

పేరుకు సింగరేణి థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా ఉంది. కానీ నిర్వహణ, విద్యుత్ ఉత్పత్తి అంతా ప్రైవేటు కంపెనీకే ధారాదత్తం చేస్తున్నారు. ప్రతీ ఐదేళ్లకోసారి టెండరు పిలిచి ఏ కంపెనీ తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉత్పత్తి, నిర్వహణ చేయగలదో ఆ కంపెనీకి కట్టబెడుతున్నారు. దీంతో ఆ ప్రైవేటు సంస్థలు తమకు కావాల్సిన, అనుకూలమైన వారిని బయటి నుంచి తెచ్చుకుంటూ ఉద్యోగ కల్పనలో భూమిపుత్రుల పొట్టగొడుతున్నారు. కార్మిక సంఘాలు, భూనిర్వాసితులు నిరసనలు తెలిపినా పట్టించుకునే వారే కరువయ్యారు.

రోజువారీ కూలీలుగా నిర్వాసితులు

2005లో అప్పటి సింగరేణి సీఎండీ నర్సింగ్‌రావు 500 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టును నిర్మించాలని భావించారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా 1200 మెగావాట్ల సామర్థ్యానికి పెంచారు. గోదావరి తీరంలో బొగ్గు నిల్వలు ఉన్న జైపూర్ మండలం పెగడపల్లి, గంగిపెల్లి, ఎల్కంటి పరిధిలో 1,883 ఎకరాల భూమి సేకరించారు. 825 నిర్వాసిత కుటుంబాలకు ఇంటికో ఉద్యోగం ఇస్తామని హామీనిచ్చారు. ప్రాజెక్టు నిర్మాణానికి అడ్డంకులు తొలగి 2009లో ప్లాంటు నిర్మాణం ప్రారంభమైంది. నిర్వాసిత కుటుంబంలో ఒక నిరుద్యోగికి అర్హతను బట్టి ఉద్యోగం ఇస్తామని సింగరేణి యాజమాన్యం నమ్మబలికింది. అవేమీ అమలు కాలేదు. ప్రస్తుతం విద్యుత్ ఉత్పత్తి విభాగంలో 1,470 మంది, సివిల్ విభాగంలో మరో 250 మంది వరకు ఉన్నారు. ఇందులో స్థానికులు 400 మంది పని చేస్తున్నారు. నిర్వాసిత గ్రామాల నుంచి 200 మంది మాత్రమే ఉన్నారు. హెల్పర్లకు రోజువారీగా రూ.475 చెల్లిస్తుంటే, సెమీ స్కిల్డ్ వర్కర్లకు రూ.520 ఇస్తున్నారు. ఉద్యోగ అర్హతను బట్టి నిర్వాసితులకు ఇంజినీరింగ్ విభాగాల్లోనూ పని ఇవ్వొచ్చు. కానీ ఎక్కువగా అన్‌స్కిల్డ్‌కే పరిమితం చేస్తున్నారు. వీటిపై పలు మార్లు స్థానికులు నిరసన తెలిపినా ప్రయోజనం లేకపోయింది. స్థానికులకు ఉద్యోగాలపై ఇక్కడి ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా పట్టించుకునే వారు కరువయ్యారు. కాంట్రాక్టు పనుల్లో నిర్వాసితులకు నామినేటెడ్ పద్ధతిలో ఇవ్వాలని ఉన్నా ఆచరణకు నోచుకోవడం లేదు.

ఇక్కడి బొగ్గు, నీరు వినియోగం

ప్లాంటుకు కావాల్సిన బొగ్గు జిల్లా పరిధిలోని గనుల నుంచే సరఫరా అవుతోంది. నీరు షెట్‌పల్లి శివారు గోదావరి నుంచి ఒక టీఎంసీ, కోటపల్లి మండలం దేవులవాడ శివారు ప్రాణహిత నుంచి రెండు టీఎంసీలు తీసుకుంటున్నారు. ఇందుకు ప్రత్యేక పైపులైన్ ఉంది. బొగ్గు రవాణాకు రైల్వే లైను, రోడ్డుమార్గం ఉంది. స్థానిక వనరులు వినియోగించుకుని ఇక్కడి నిర్వాసితులకు సింగరేణి మొండి చేయిచూపుతోందనే విమర్శలు ఉన్నాయి. ఇక పర్యావరణ ప్రభావం స్థానిక ప్రజలపైనే చూపుతోంది. కానీ ఉద్యోగాల కల్పనలో మాత్రం ప్రయోజనం దక్కలేదు.

ఆరిజిన్ డెయిరీ బోగస్ సంస్థ

- నిర్వాహకుల ఆరోపణల్లో నిజం లేదు
- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లి: పాల ఉత్పత్తి కేంద్రం పేరుతో ఆరిజిన్ డెయిరీ నిర్వాహకులు నమ్మినవారిని నయవంచనకు గురి చేశారని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆరోపించారు. శుక్రవారం ఏఎంసీ ఏరియాలోని క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పాడి రైతులకు ఉపాధి కల్పిస్తామని నమ్మించి తనను అడ్డంపెట్టుకుని రైతుల వద్ద డెయిరీ నిర్వాహకులు ఆదినారాయణ, షేజల్ అందినకాడికి దండుకున్నారని తెలిపారు. అభూత కల్పనలతో రైతులను మోసం చేశారని, ఈ విషయాన్ని ఆలస్యంగా గ్రహించానని అన్నారు. రైతులను మోసం చేయడం తప్ప డెయిరీ ఏర్పాటు చేసిన దాఖలాలు లేవని, తెలుగు రాష్ట్రాల్లో వందలాది మంది రైతులను పాల ఉత్పత్తి కేంద్రం పేరుతో బురిడీ కొట్టించారని పేర్కొన్నారు. వారిపై ఇప్పటివరకు 22 పోలీసు కేసులు నమోదయ్యాయని, షేజల్‌ను అడ్డుపెట్టుకుని ఆదినారాయణ మోసాలకు పాల్పడుతున్నారని, ఆయన ఉచ్చులో చిక్కుకుని ఆ మహిళ మరో మార్గం లేక అనేకమందిపై తప్పుడు కేసులు పెట్టడం, వేధించడం చేస్తున్నారని వివరించారు. డెయిరీ నిర్వాహకులు తనపై చేసిన ఆరోపణల్లో ఏమాత్రం నిజం లేదని కొట్టిపారేశారు. రైతులకు న్యాయం జరగడం కోసం పోలీసు కేసులు పెట్టించి అరెస్టు చేయించడంతో తనపై కక్షగట్టి పరువు తీయడానికి నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్ తనకే టిక్కెట్ ఇస్తారని, సీఎం, ప్రజల ఆశీర్వాదంతో 50 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధిస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు. బొగ్గుబ్లాకుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 8న సీసీసీ నస్పూర్ కేంద్రంగా బీఆర్ఎస్, టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహాధర్నాకు కార్మికులు, పార్టీ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బొడ్డు నారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

మహాధర్నా ఏర్పాట్లు పరిశీలించిన విప్ సుమన్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న విప్ బాల్క సుమన్

శ్రీరాంపూర్: సింగరేణి బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణను నిరసిస్తూ శనివారం సీసీసీ కార్నర్ వద్ద బీఆర్ఎస్, టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో తలపెట్టిన జిల్లా స్థాయి మహాధర్నా ఏర్పాట్లను ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్, టీఆర్ఎస్ జిల్లా నాయకుడు విజిత్‌రావు శుక్రవారం పరిశీలించారు. బొగ్గు బ్లాకుల వేలంను నిరసిస్తూ ప్రధాని మోదీకి కార్మిక వర్గం నుంచి పెద్దయెత్తున నిరసన తెలపాలనే ఉద్దేశంతో మోదీ హఠావో..సింగరేణి బచావో పేరుతో మహాధరానిర్వహిస్తున్నట్లు తెలిపారు. పది వేల మందికి పైగా పాల్గొననున్న నేపథ్యంలో ఏర్పాట్లు బాగుండాలని విప్ సూచించారు. ధర్నా ఏర్పాట్లను విజిత్‌రావు ఆయనకు వివరించారు. అనంతరం విప్ స్థానిక నేతలతో కలిసి హోటల్‌లో టీ తాగుతూ పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, టీబీజీకేఎస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, నాయకులు ఏనుగు రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు వంగ తిరుపతి, నాయకులు మహేందర్‌రెడ్డి, అన్వేశ్ రెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్ల మౌనదీక్ష



వాల్యుయేషన్ కేంద్రం వద్ద లెక్చరర్లు

మంచిర్యాలఅర్బన్: సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ఇచ్చిన హామీ మేరకు ఏప్రిల్ ఒకటి నుంచి కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించాలని శుక్రవారం మంచిర్యాలలోని ఇంటర్మీడియెట్ స్పాట్ వాల్యుయేషన్ కేంద్రం వద్ద మౌన దీక్ష చేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ 2016లో కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణ కోసం జీవో నంబరు 16 జారీ చేశారని, కొందరు కోర్టులో సవాల్ చేయగా 2021లో సుప్రీంకోర్టు క్రమబద్ధీకరణకు అనుకూలంగా తీర్పునిచ్చిందని గుర్తు చేశారు. అందుకు అనుగుణంగా క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఆ హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ జిల్లా కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు ప్రసాద్, ప్రభాకర్, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరసనలు విజయవంతం చేయండి



మాట్లాడుతున్న కలవేణ శంకర్

నస్పూర్: ప్రధాని నరేంద్రమోదీ హైదరాబాద్ పర్యటనకు వ్యతిరేకంగా సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలు విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్యతో కలిసి నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. సింగరేణి బొగ్గు బ్లాకులను బహిరంగ వేలం వేస్తూ ప్రైవేటీకరణకు పాల్పడుతున్నారని విమర్శించారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో, ఏరియాలోని అన్ని గనులు, డిపార్ట్‌మెంట్ల వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతామని వివరించారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు లింగం రవి, మేకల దాసు, జిల్లా సమితి సభ్యులు మిర్యాల రాజేశ్వర్‌రావు, శాఖపురపు కిరణ్, దొడ్డిపట్ల రవీందర్, మొగిళి లక్ష్మణ్, నాయకులు సన్నీగౌడ్, రాగిడి రాజు, హరీశ్, అనంత రెడ్డి, నర్సింగరావు పాల్గొన్నారు.

ఆగని ఇసుక దందా

- వాగుల నుంచి తరలింపు
- పట్టించుకోని అధికారులు



గుండ్ల సోమారం వాగు నుంచి ఇసుక తరలింపు

బెల్లంపల్లి: ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం ఇసుక అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. నిబంధనలు ఉల్లంఘిస్తూ ఇసుక తోడేస్తున్నా పట్టింపు కరువైంది. బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల వాగులు అక్రమార్కులకు వరంగా మారాయి. ఎండాకాలం కావడంతో అక్రమ రవాణాకు అనువైన పరిస్థితులు ఏర్పడ్డాయి. నెన్నెల, భీమిని, కన్నెపల్లి, వేమనపల్లి, తాండూర్, బెల్లంపల్లి, కాసిపేట మండలాల్లో ఇసుక దందా అడ్డూఅదుపు లేకుండా సాగుతోంది. విరామం లేకుండా ఇసుక తరలించడం సర్వసాధారణమైంది. అటవీ శివారు ప్రాంతాల్లో, పంట పొలాలకు చేరువలో, చెరువు, కుంటల ప్రాంతాల్లో వాగులు ఉన్నాయి. వరద నీటిని చెరువు, కుంటలకు మళ్లించడంలో వాగులు కీలక భూమిక పోషిస్తున్నాయి. భూమి కోతకు గురి కాకుండా, పంట పొలాలు దెబ్బతినకుండా ఉపయోగపడుతున్నాయి. వర్షాలు కురిసి నీటి ప్రవాహం నిలిచిపోయిన తర్వాత ఇసుక మేటలు వేసి ఉంటోంది. వాగుల్లోని ఇసుక తోడేసి తరలిస్తుండడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. మార్చికి ముందే నీటి మడుగులు అడుగంటి పశువులు, పక్షులకు తాగు నీరు అందని ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయి. అటవీ జంతువులకు తాగునీరు లభించక సమీప గ్రామాలకు వచ్చి వీధి కుక్కల బారిన పడి మృతిచెందడం, గాయపడడం జరుగుతోంది.

గ్రామాల వైపు కన్నెత్తి చూడని అధికారులు

ప్రజావసరాల రీత్యా ప్రభుత్వం ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేసింది. నెన్నెల మండలం ఖర్జీ ప్రాంతంలో రీచ్‌ను అధికారికంగా నిర్వహిస్తోంది. కానీ అనేక గ్రామాల శివారు ప్రాంతాల నుంచి రోజువారీగా ట్రాక్టర్లలో ఇసుక అక్రమ రవాణా జరుగుతూనే ఉంది. భూగర్భ జనవనరులు, రెవెన్యూ, అటవీ, పోలీసు శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలున్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కుల దందాకు ఎదురు లేకుండా పోతోంది. కొందరు అధికారులు లోపాయికారీగా సహకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఒకట్రెండు ట్రాక్టర్లపై కేసులు నమోదు చేసి చేతులు దులిపేసుకుంటున్నారు.

అటవీ ప్రాంతాల్లో మా బాధ్యత ఉండదు

వాగులు, వంకల్లో నుంచి ఇసుక తోడి తీసుకెళ్లడాన్ని అడ్డుకోవాల్సిన బాధ్యత రెవెన్యూ, అటవీశాఖ అధికారులపై ఉంది. చాలామట్టుకు అటవీ శివారు ప్రాంతాల్లోని వాగుల నుంచి ఇసుక తోడి రవాణా చేస్తున్నట్లు సమాచారం వస్తోంది. ఆయా శాఖలు స్పందించాల్సి ఉంది. మా వరకు రీచ్‌ల నుంచి ఇసుక అక్రమంగా రవాణా కాకుండా అడ్డుకుంటున్నాం. గత వారంలో బెల్లంపల్లిలో మూడు ట్రాక్టర్లపై కేసులు నమోదు చేశాం. రోజువారీగా పర్యవేక్షణ చేస్తున్నాం.

– బాలు, గనులు, భూగర్భ వనరుల శాఖ ఏడీ, మంచిర్యాల

ముంపు రైతులకు శాశ్వత పరిష్కారం



కాళేశ్వరం ముంపు గ్రామాల రైతులతో మాట్లాడుతున్న మల్లు భట్టి విక్రమార్క, నాయకులు

- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క
- కాళేశ్వరం ప్రాజెక్టు ముంపు రైతులతో సమావేశం

జైపూర్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కాళేశ్వరం ప్రాజెక్టుకు రిటైనింగ్ వాల్ నిర్మించి ముంపు రైతులకు శాశ్వత పరిష్కారం చూపుతామని సీఎల్పీ నాయకుడు మల్లు భట్టి విక్రమార్క అన్నారు. జిల్లాలో 'భట్టి' పీపుల్స్‌మార్చ్ పాదయాత్రలో భాగంగా మండలంలోని ఇందారం దుబ్బపల్లి శిబిరంలో శుక్రవారం కాళేశ్వరం ముంపు గ్రామాల రైతులు, నాయకులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఎగువన అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంతో గోదావరి సమీప ప్రాంత పంట పొలాలు ప్రతియేటా నీట మునిగి తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు తెలిపారు. గత ఏడాది కురిసిన భారీ వానలతో పంట పొలాలే కాకుండా ఊళ్లకు ఊళ్లు నీటమునిగి తీవ్ర నష్టం వాటిల్లిందని వివరించారు. 'భట్టి' మాట్లాడుతూ కమీషన్ల కోసం ప్రాణహిత–చేవేళ్ల ప్రాజెక్టును ఎత్తివేసి ప్రకృతికి విరుద్ధంగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి వేల కోట్లు దండుకున్నారని ఆరోపించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రాణహిత–చేవేళ్ల ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి రైతులకు సాగు నీరు అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, పీసీసీ సభ్యులు నూకల రమేశ్, జిల్లా ప్రధానకార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

అసెంబ్లీ స్థానాలు కేటాయించాలి

ఏఐసీసీ తీర్మానం ప్రకారం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఒక్కో పార్లమెంటు నియోజకవర్గంలో అత్యధిక జనాభా కలిగిన బీసీలకు రెండు అసెంబ్లీ స్థానాలు కేటాయించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు భట్టి విక్రమార్కను కోరారు. బీసీ సంఘం నాయకులు ఆయనను కలిసి పలు అంశాలను వివరించారు. అత్యధిక జనాభా కలిగిన బీసీలకు ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లు కల్పించాలని, ఏఐసీసీ తీర్మానించిన 10అంశాలను అమలు చేస్తే అధికారంలోకి రావడం ఖాయమని పేర్కొన్నారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. నేతకాని హక్కుల జాతీయ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు గోమాస శ్రీనివాస్, నాయకులు ప్రతాప్ పాల్గొన్నారు.

మాట తప్పిన దేశ ప్రధాని

- బొగ్గుబ్లాక్‌లను సింగరేణికి ఇవ్వాలి
- మోదీ పర్యటనను వ్యతిరేకిస్తూ నేడు మహాధర్నా
- మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్.దివాకర్‌రావు

శ్రీరాంపూర్: సింగరేణిని ప్రైవేటీకరించబోమని ఇచ్చిన మాటను ప్రధాని నరేంద్రమోదీ తప్పారని మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. సింగరేణి పరిధిలోని నాలుగు బొగ్గు బ్లాకులను వేలం వేస్తూ ప్రకటించిందని తెలిపారు. ఈ నేపథ్యంలో మోదీ పర్యటను వ్యతిరేకిస్తూ శనివారం సీసీసీ కార్నర్ వద్ద మహాధర్నా తలపెట్టినట్లు తెలిపారు. ధర్నాకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీ వెంకటేష్‌నేత, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, మాజీ ఎమ్మెల్యేలు అరవిందరెడ్డి, ఓదెలు, టీబీజీకేఎస్ నాయకులు హాజరవుతారని తెలిపారు. సింగరేణిని నాశనం చేసే కుట్రను కార్మికవర్గం తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఆ నాలుగు బొగ్గు బ్లాకులను సింగరేణికే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, టీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, టీబీజీకేఎస్ కేంద్ర నాయకులు మంద మల్లారెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు వంగ తిరుపతి, మల్లయ్య, పూదరి కుమార్, నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే



పట్టణంలో క్రైస్తవుల ప్రదర్శన

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాలలోని సెక్రెడ్ హార్ట్ క్యాథలిక్ చర్చి ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఏసుక్రీస్తు శిలువ యాత్ర ప్రదర్శన క్రైస్తవుల్లో భక్తిభావం నింపింది. చర్చి ప్రాంగణం నుంచి బెల్లంపల్లి చౌరస్తా మీదుగా లక్ష్మీటాకీస్ వరకు క్రీస్తు వేషధారి, క్రైస్తవులు శిలువలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బొక్కలగుట్ట గ్రామంలో కొండపై శిలువ ఆరాధనకు భక్తులు తరలివెళ్లారు. ఆదిలాబాద్ మేత్రాసన పీఠాధిపతులు ఆంటోని క్రీస్తు శ్రమలు లోకానికి ఇచ్చిన ప్రేమ సందేశాన్ని అందించారు. చర్చి ఫాధర్‌లు జోష్ మాణిక్యతన్, స్టీఫెన్, ఏబిన్, సిస్టర్లు పాల్గొన్నారు. పట్టణంలోని పలు చర్చిల్లో గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని క్రీస్తు చరిత్రను చదివి వినిపించారు.

ఎమ్మెల్యే చిన్నయ్య దిష్టిబొమ్మ దహనం



చిన్నయ్య దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

బెల్లంపల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాలకు నిరసనగా బీజేపీ శ్రేణులు శుక్రవారం బెల్లంపల్లిలోని పాత బస్టాండ్ చౌరస్తా వద్ద ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక స్కామ్‌లకు పాల్పడుతోందని విమర్శించారు. స్కామ్‌లకు వ్యతిరేకంగా పోరాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై కేసు పెట్టి జైలుకు పంపించడం దారుణమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కోడి రమేష్, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ రాచర్ల సంతోష్‌కుమార్, నాయకులు నరేష్, విజయ్, సబ్బని రాజనర్సు, సురేష్, రేవెల్లి రాజలింగు, వెంకటేష్, అగర్వాల్, లక్ష్మణ్, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు కళ్యాణి, అజయ్, రాములు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణపై ప్రజలకు అవగాహన



పాల్గొన్న అధికారులు, స్థానికులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఆరోగ్య పరిరక్షణపై ప్రజలకు నిరంతరం అవగాహన కల్పిస్తూ వైద్య సేవలు అందిస్తున్నామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ మాస్ మీడియా కో ఆర్డినేటర్ బుక్క వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండలంలోని దొనబండ పల్లె గ్రామ పంచాయతీ ఆవరణలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వ్యాధుల బారి నుంచి రక్షణ పొందేలా చైతన్యం కావాలని సూచించారు. ఆరోగ్య నినాదంలో భాగంగా జిల్లాలోని 121 పల్లె దవాఖానాల్లో స్థానిక ఆరోగ్య కార్యకర్తల సేవలు పొందాలని తెలిపారు. ఎండాకాలంలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పల్లె దవాఖానాల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచామని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారి నాందేవ్, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ సుమలత, ఆశాకార్యకర్తలు రజిత, స్రవంతి పాల్గొన్నారు.

'సింగరేణిని ప్రైవేటీకరించిన బీఆర్ఎస్ ప్రభుత్వం'

పాతమంచిర్యాల: సింగరేణి సంస్థను బీఆర్ఎస్ ప్రభుత్వం 70శాతం ప్రైవేటీకరించిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి విమర్శించారు. మంచిర్యాలలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సింగరేణిని కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తోందని బీఆర్ఎస్ ప్రభుత్వం, నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని ఖండించారు. సింగరేణిని ప్రైవేటీకరణ చేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికి లేదని ప్రధాని నరేంద్ర మోదీ రామగుండం సభలో ప్రస్తావించారని పేర్కొన్నారు. సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, ప్రభుత్వాన్ని కార్మికులు ప్రశ్నిస్తారనే భయంతో కొత్త నాటకానికి తెరతీశారని విమర్శించారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు రజనీష్‌జైన్, అగల్‌డ్యూటి రాజు, బొద్దున మల్లేష్, అక్కల రమేష్, గాజుల ప్రభాకర్, జోగుల శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చేపల వలకు చిక్కిన మొసలిపిల్ల!


వలలో చిక్కిన మొసలి పిల్ల ఇదే..

దండేపల్లి: మండలంలోని పెద్దపేట చెరువులో శుక్రవారం జాలర్లు చేపలు పడుతుండగా వలలో ఓ మొసలిపిల్ల చిక్కింది. దానిని చూసి కంగుతిన్న జాలర్లు విషయాన్ని తాళ్లపేట అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఎఫ్ఆర్వో రత్నాకర్ రావు తమ సిబ్బందితో చెరువు వద్దకు చేరుకుని మొసలిపిల్లను తమ వాహనంలో గూడెం గోదావరి తీరానికి తీసుకెళ్లి నదిలో వదిలిపెట్టారు.

అటవీశాఖ అధికారుల దాడులు

- 50 వేల విలువ గల కలప పట్టివేత


పట్టుకున్న కలపతో అటవి అధికారులు

జన్నారం: న్నారం అటవి డివిజన్ పరిధిలోని ఇందన్‌పెల్లి అటవీ రేంజ్ మొర్రిగూడ, కామన్‌పెల్లి, దేవునిగూడెం, కవ్వాల్, హాస్టల్ తండా, నాయికపుగూడ, కొత్తూర్‌పల్లి గ్రామాల్లో శుక్రవారం అటవీశాఖ అధికారులు దాడులు నిర్వహించి ఇంటింటా తనిఖీలు చేపట్టారు. కవ్వాల్ గ్రామంలో 23 టేకు చెక్కలు, 02 టేకు దుంగలు స్వాధీనం చేసుకున్నామని రేంజ్ అధికారి హాఫీజోద్దీన్ తెలిపారు. పట్టుకున్న కలప విలువ రూ. 50 వేలు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జన్నారం, ఇందన్‌పల్లి రేంజ్ సిబ్బంది కిరణ్మయి, అఫ్జల్, ఆనంద్, సహీరా పర్వీన్, శేషారావ్, శివకుమార్, రవి పాల్గొన్నారు.

లారీ అదుపుతప్పి బోల్తా


రసూల్‌పల్లి వంతెన వద్ద బోల్తాపడిన లారీ

జైపూర్: మండలంలోని రసూల్‌పల్లి సమీపంలోని పెద్దవాగు వంతెన వద్ద పత్తి లారీ అదుపు తప్పి బోల్తాపడింది. చెన్నూర్ నుంచి పత్తి లోడుతో మంచిర్యాల వైపు వెళ్తున్న లారీ రసూల్‌పల్లి పెద్దవాగు లో లెవల్ వంతెన వద్ద బోల్తాపడింది. లారీ బోల్తాపడినప్పటికీ డ్రైవర్, క్లీనర్ క్షేమంగా బయటపడ్డారు.

ప్రభుత్వ బడులకు ట్యాబ్‌లు

- త్వరలో పంపిణీ చేయనున్నట్లు అధికారులు
- ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ
- మౌలిక వసతుల మెరుగుకు చర్యలు

జిల్లాల వారీగా ట్యాబ్‌ల పంపిణీ	
ఆదిలాబాద్	565
మంచిర్యాల	533
కుమురంభీం	586
నిర్మల్	553


ఆదిలాబాద్ జిల్లాకు చేరిన ట్యాబ్‌లు

నిర్మల్‌రూరల్: పాఠశాల విద్యను మరింత బలోపేతం చేయడంతో పాటు ఆధునిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కరోనా తదితర కారణాలతో ప్రాథమిక పాఠశాల్లోని విద్యార్థులకు కనీస సామర్థ్యాలు సాధించలేకపోయారని గుర్తించి ప్రభుత్వం ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం కింద ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. సర్కారు బడుల్లో కార్పొరేట్‌కు దీటుగా విద్యను అందించేందుకు కొత్త రూపు సంతరించుకుంటున్నాయి. ఇందులో భాగంగానే ప్రభుత్వ పాఠశాలలకు ట్యాబ్‌లు అందించేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. నిర్మల్ జిల్లా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల 618 ఉండగా ఇప్పటికే 553 ట్యాబ్‌లు జిల్లాకు చేరుకున్నాయి. త్వరలో ఎంపిక చేసిన బడులకు వీటిని అందిందించనున్నారు. తొలివిడతలో రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన 19,800 పాఠశాలలకు అందజేయనున్నారు.

జిల్లాకు చేరిన 553 ట్యాబ్‌లు..

ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు 553 ట్యాబ్‌లను కేటాయించింది. జిల్లాలో ఇప్పటికే మన ఊరు– మనబడి, మన బస్తీ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపడుతున్నాయి. 2023– 24 విద్యా సంవత్సరంలో విద్యార్థులకు సరికొత్త యూనిఫామ్ కోసం ప్రభుత్వం ఇప్పటికే వస్త్రాన్ని అందజేసింది. ప్రస్తుతం బడుల సమగ్ర సమాచారాన్ని ప్రతిరోజు ఉపాధ్యాయులు సెల్ ఫోన్‌తో ।యుడైస్ ప్లస్₹ లో నిక్షిప్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఉపాధ్యాయులు రిక్వెస్ట్ చేయడంతో ట్యాబ్‌లను సరఫరా చేసిందని జిల్లా విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

మంచిర్యాల జిల్లాలో...

మంచిర్యాల జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 433, ప్రాథమికోన్నత 95 ఉన్నాయి. మొత్తం 528 పాఠశాలలకు 533 ట్యాబ్‌లు జిల్లాకు చేరాయి.

ఆసిఫాబాద్ జిల్లాలో..

కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 535, ప్రాథమికొన్నత పాఠశాలలు 98 ఉండగా 571 పాఠశాలలు మాత్రమే 586 ట్యాబ్‌లు పంపిణీ చేయనున్నారు.

ఏం చేస్తారు...

జిల్లాలో కొన్ని ప్రాథమిక, ప్రాథమిక, ఉన్నత పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటి వివరాలు, అదేవిధంగా విద్యార్థికి ఆయా పరీక్షల్లో వచ్చిన మార్కులు, పాఠ్యాంశ ప్రణాళిక అమలులో విద్యార్థి ప్రతిభ, విద్యార్థి అడ్మిషన్ సంఖ్య, మధ్యాహ్న భోజనం, అభ్యసన సామర్థ్యం, మన ఊరు– మన బడి, మన బస్తీ, పాఠశాల వదిలి వెళ్లిన తేదీ తదితర విషయాలన్నీ ఇందులో నిక్షిప్తం చేయనున్నారు. జిల్లాలో మొత్తం 735 ప్రభుత్వ జిల్లాలో 150 కంటే ఎక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలలకు రెండేసి ట్యాబ్‌లను అందజేస్తారు.

త్వరలో అందజేస్తాం



జిల్లాకు 553 ట్యాబ్‌లు వచ్చాయి. వీటిని డీఈవో కార్యాలయంలో భద్రపరిచాం. త్వరలోనే ఉపాధ్యాయులకు అందజేస్తాం. పాఠశాలకు సంబంధించిన రిపోర్ట్‌లు సెల్‌ఫోన్‌లో పంపించే క్రమంలో ఉపాధ్యాయులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యలు ఉత్పన్నం కాకుండా ప్రభుత్వం వీటిని సరఫరా చేస్తోంది. – రవీందర్‌రెడ్డి, డీఈవో, నిర్మల్

ఆదిలాబాద్ జిల్లాకు..

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని పభుత్వ ప్రాథమిక, ప్రాథమికొన్నత పాఠశాలలకు సంబంధించిన సమస్త సమాచారాన్ని నిక్షిప్తం చేసేందుకు వీలుగా ప్రభుత్వం ట్యాబ్‌లను మంజూరు చేసింది. ఈ మేరకు శుక్రవారం సామ్‌సాంగ్ కంపెనీకి చెందిన 565ట్యాబ్‌లు జిల్లాకు చేరారు. జిల్లాలో 436 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలుండగా 450 ట్యాబ్‌లు, 105 ప్రాథమికొన్నత పాఠశాలలకు 115 ట్యాబ్‌లను మంజూరు చేశారు. పది నుంచి 165 మంది విద్యార్థులకు ఒక ట్యాబ్‌ను అందించనుండగా అంతకు మించి విద్యార్థుల సంఖ్య కలిగిన పాఠశాలలకు రెండు చొప్పున ట్యాబ్‌లు అందించనున్నారు. మొత్తం 541 పాఠశాలకు 565 ట్యాబ్‌లను పంపించారు. ప్రాథమిక, ప్రాథమికొన్నత పాఠశాలల్లోని విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజన వివరాలు, పాఠశాలలకు సంబంధించిన సమస్త సమాచారాన్ని ట్యాబ్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయనున్నారు. ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి ట్యాబ్‌లను అందజేస్తామని డీఈఓ టి.ప్రణీత తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ


లారీ ఢీకొన్న బస్సు

ఆసిఫాబాద్‌రూరల్: ఆర్టీసీ డిపో బస్సును లారీ ఢీకొన్న సంఘటన జిల్లా కేంద్ర సమీపంలోని ఆదిలాబాద్ ఎక్స్‌రోడ్ వద్ద చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రపూర్ నుంచి ఆసిఫాబాద్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సు ఆదిలాబాద్ ఎక్స్ రోడ్డు దాటి ఆసిఫాబాద్ ప్రవేశించే క్రమంలో బైపాస్ వద్ద ఎదురుగా వస్తున్న లారీ వెనుక భాగంలో ఢీ కొట్టింది. బస్సులో మొత్తం 85 మంది ప్రయాణికులు ఉండగా వాహనాల వేగం అదుపులో ఉండడంతో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఇదే విషయం డిపో మేనేజర్ శ్రీధర్‌ను అడగగా బస్సులో ముగ్గురికి చిన్నగా గాయాలైనట్లు మహారాష్ట్ర దేవాడకు చెందిన సురేష్‌కు కొంచెం ఎక్కువగా గాయాలు కావడంతో అసుపత్రికి తరలించినట్లు తెలిపారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

తవ్వకాల్లో బయటపడ్డ సీతారాముల విగ్రహాలు


విగ్రహాలకు గ్రామస్తుల పూజలు..

జన్నారం: మంచిర్యాల జిల్లా జన్నారం మండలం తపాలపూర్ అటవీ ప్రాంతంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పథకం కందకాల పనుల్లో శుక్రవారం సీతారాముల విగ్రహాలు బయటపడ్డాయి. కూలీలు కందకాలు తీస్తుండగా పంచలోహ విగ్రహాలు కనిపించడంతో బయటకు తీశారు. గ్రామస్తులు చేరుకుని పూజలు నిర్వహించారు. ఏఎస్సై రత్నం, ఆర్ఐ భానుచందర్ అక్కడికి చేరుకుని విగ్రహాలను పరిశీలించారు. వాటిని దేవాదాయ శాఖకు అప్పగిస్తామని చెప్పగా గ్రామస్తులు అంగీకరించలేదు. ఇక్కడే నెలకొల్పి పూజలు చేస్తామని స్పష్టం చేశారు. దీంతో విగ్రహాలను సర్పంచ్ తిరుపతి, ఉపసర్పంచ్ రాజేశ్వర్, గ్రామ పెద్దల సమక్షంలో గ్రామంలోని సచివాలయంలో భద్రపర్చారు.

షావెల్ బోల్తాపడి ఆపరేటర్‌కు గాయాలు


ఆపరేటర్‌ను పరామర్శిస్తున్న సత్యనారాయణ

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే–ఓసీలో శుక్రవారం రెండో షిఫ్ట్‌లోని విధి నిర్వహణలో షావల్ అదుపు తప్పి బోల్తా పడడంతో సంజీవ్‌కుమార్ అనే ఆపరేటర్‌కు గాయాలయ్యాయి. వెంటనే అతడిని కళ్యాణిఖని ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి రామకృష్ణాపూర్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో సంజీవ్‌ను ఏఐటీయూసీ మందమర్రి ఏరియా బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు శ్రీనివాస్ పరామర్శించారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

పాతమంచిర్యాల: ఈ నెల 9న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సాంబమూర్తి కార్యదర్శి మారయ్య శుక్రవారం తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే బాలబాలికలు 20 ఏళ్లలోపు ఉండాలని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపినవారికి ఈ నెల 15, 16 తేదీల్లో హన్మకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వివరించారు. ఆసక్తి గల క్రీడాకారులు 9వ తేదీన ఉదయం 6గంటలకు సీతారాంపల్లి సెకండరీ పాఠశాలలో రిపోర్టు చేయాలన్నారు. వివరాలకు ఈ 9849646224 నంబర్‌లో సంప్రదించాలన్నారు.



పాఠశాలనే.. పైకప్పు కొట్టుకుపోయింది..

కాగజ్‌నగర్‌రూరల్: ఇదీ కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ మండలం మాలిని గ్రామ పంచాయతీ పరిధి మానిక్‌పటార్‌లోని ఏకోపాధ్యాయ పాఠశాల. ఇందులో 20మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. మండల కేంద్రం నుంచి 24 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామంలో 36 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. శుక్రవారం మండలంలో ఈదురుగాలులతో కూడిన వర్షానికి తడకల పాఠశాల పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. అలాగే మానిక్‌పటార్, రేగులగూడ, ఊటిపల్లి, లైనుగూడ, ఎల్లాపూర్, జోగాపూర్, గోంది, నందిగూడ, శివాపూర్, బారెగూడ, మాలిని గ్రామాల్లో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. చెట్లు నేలకొరగడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. గన్నారం, మోసం, ఈజ్‌గాం గ్రామాల్లో మామిడితోటలకు నష్టం వాటిల్లింది.

మోదీకి నిరసన సెగ చూపాలి

- టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య



సమావేశంలో మాట్లాడుతున్న కెంగర్ల మల్లయ్య

శ్రీరాంపూర్: రాష్ట్రానికి వస్తున్న మోదీకి సింగరేణి కార్మికవర్గం తమ నిరసన సెగ చూపాలని టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య తెలిపారు. శుక్రవారం ఆయన నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో యూనియన్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. సింగరేణిలో నాలుగు బొగ్గు బ్లాకులను ప్రైవేటుకు అప్పగిస్తూ వేలం వేసిన మోదీ నేడు రాష్ట్ర పర్యటనకు వస్తున్నందున ఆయనకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్ డివిజన్‌లోని కార్మికులంతా శనివారం ఉదయం 10:30 గంటలకు సీసీసీ కార్నర్‌లో జరిగే మహాధర్నాకు తరలిరావాలన్నారు. సింగరేణిని కుట్ర పూరితంగా ప్రైవేటు పరం చేయడానికి మోదీ సర్కార్ పన్నాగాలు పన్నుతోందన్నారు. ఇప్పటికే కోలిండియాలో 33 శాతం షేర్లను ప్రైవేటు సంస్థలకు విక్రయించారని మండిపడ్డారు. ప్రభుత్వ సంస్థల్లో డిజిన్వెస్ట్‌మెంట్ ద్వారా రూ.65వేల కోట్లను సమకూర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, కేంద్ర ఉపాధ్యక్షులు అన్నయ్య, మంద మల్లారెడ్డి, కేంద్ర చర్చల ప్రతినిధి ఏనుగు రవీందర్‌రెడ్డి, నాయకులు పెట్టం లక్ష్మణ్, వెంగళకుమారస్వామి, కాశీరావు, కానుగంటి చంద్రయ్య, చేరాలు, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయండి
–టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపెల్లి సంపత్

రామకృష్ణాపూర్: కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో శనివారం సీసీసీలో తలపెట్టిన మహాధర్నాను కార్మికులు విజయవంతం చేయాలని యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపెల్లి సంపత్ పిలుపునిచ్చారు. మందమర్రి ఏరియాలోని ఆర్‌కేపీ ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు బడికల సంపత్, రమణ, శంకర్రావు, మేకల రాజయ్య, ముద్దసాని కృష్ణ, సంఘం నాయకులు పాల్గొన్నారు.

వాహనం బోల్తాపడి ఒకరి మృతి


- మరో ఇద్దరికి గాయాలు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని బాబాపూర్ గ్రామ సమీపంలో శుక్రవారం సాయంత్రం బొలేరో వాహనం బోల్తా పడి మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా ఆళ్లపల్లికి చెందిన అరుణ్ ఆనంద్‌రావు(23) అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. కాగజ్‌నగర్ నుంచి మహారాష్ట్రలోని ఆళ్లపల్లికి బెల్లం లోడుతో వెళ్తుండగా బాబాపూర్ సమీపంలో వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. బొలేరోలో అరుణ్ ఆనంద్‌రావుతోపాటు సహదేవ్ జగదేవ్, నగేశ్ సెడ్మెకె, గణేష్ సుఖ్‌దేవ్ ఆత్రం, సూరజ్ నాందేవ్ సిడాం ప్రయాణిస్తున్నారు. ఈ ప్రమాదంలో అరుణ్ ఆనంద్‌రావు అక్కడికక్కడే మృతిచెందగా, సహదేవ్ జగదేవ్, గణేష్ సుఖ్‌దేవ్‌లకు గాయాలయ్యాయి. వాహనాన్ని అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి ప్రమాదానికి కారణమైన డ్రైవర్ ప్రణయ్ దిలీప్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

పట్టుబడిన వాహనాల వేలం

పాతమంచిర్యాల: ఎక్సైజ్ నేరాలలో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 10న ఉదయం 10.30 గంటలకు మంచిర్యాల ఎక్సైజ్ స్టేషన్‌లో వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ ఎస్సై నరేందర్ తెలిపారు. ఆసక్తి గలవారు సోమవారం ఉదయం 9 గంటలకు ప్రభుత్వం నిర్ణయించిన ధరను 50శాతం ఈఎండీ రూపంలో చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు. వేలం వేసే వాహనాలను పరిశీలించుకోవచ్చని తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం


మహమ్మద్ ఫారూక్

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని జీడిచేను గ్రామానికి చెందిన మహమ్మద్ ఫారూక్ (67) అదృశ్యమైనట్లు కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై సోనియా తెలిపారు. ఈనెల 28న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఫారూక్‌కు మతిస్థిమితం లేదని గతంలో కూడా ఇలాగే ఇంట్లో నుంచి వెళ్లిపోయాడని పేర్కొన్నారు. బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆలయంలో చోరీ

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీలోని రేణుకామాతా ఆలయంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై విష్ణువర్ధన్ కథనం ప్రకారం.. రేణుకామాతా అమ్మవారిపై ఉన్న రూ.2లక్షల విలువ చేసే వెండి ఆభరణాలు, హుండీలోని రూ.30వేల నగదును దుండగులు ఎత్తుకెళ్లారు.

సైకాలజిస్ట్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక

మంచిర్యాలఅర్బన్: స్థానిక క్రిష్ణవేణి టాలెంట్ హైస్కూల్‌లో శుక్రవారం తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మానసిక వైద్య నిపుణులు సునీల్‌కుమార్ మాట్లాడుతూ నేడు సైకాలజిస్టుల అవసరం ఎంతో ఉందన్నారు. విద్యార్థుల విధ్వంసకరమైన ఆలోచనలు, వింత పోకడలకు అదుపులో ఉంచడానికి సైకాలజీ ఎంతో తోడ్పడుతుందన్నారు. అనంతరం మంచిర్యాల జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా శశికిరణ్, జిల్లా ఉపాధ్యక్షులుగా సమ్మయ్య, సుమన చైతన్య, జాయింట్ సెక్రటరీలుగా కిరణ్‌కుమార్, మొగిలి, కోశాధికారిగా చంద్రమోహన్‌గౌడ్, గౌరవ సలహాదారుగా కస్తూరి పద్మచరణ్, యోగేశ్వర్, కార్యవర్గ సభ్యులు అఫ్జల్, శ్రీకాంత్, రవికుమార్, శిరీషలను ఎన్నుకున్నట్లు ఎన్నికల పర్యవేక్షకుడు నారాయణరావు తెలిపారు.

కూరగాయల మార్కెట్‌ను తరలిస్తే ఉద్యమమే

పాతమంచిర్యాల: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్‌ను వేరే చోటికి తరలించవద్దని మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు అన్నారు. శుక్రవారం కూరగాయల మార్కెట్‌ను సందర్శించి వ్యాపారస్తులతో మాట్లాడారు. 50ఏళ్లుగా కూరగాయల అమ్మకాలపై జీవనోపాధి పొందుతున్న వ్యాపారులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. కూరగాయల మార్కెట్ సముదాయాన్ని వేరే చోటికి మారిస్తే వ్యాపారుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు.

సబ్‌స్టేషన్ పనులు పరిశీలించిన డైరెక్టర్


పరిశీలిస్తున్న డైరెక్టర్ మోహన్‌రెడ్డి

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శివాజీనగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న 33/11 సబ్‌స్టేషన్‌ను టీఎస్ఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్ మోహన్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. సబ్‌స్టేషన్ నిర్మాణంలో పెండింగ్‌లోని పనులను సైతం త్వరితగతిన పూర్తిచేసి వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావాలని త్వరలోనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎస్ఈ శేషారావు, డీఈ ఖాసర్, ఏడీఈ రాజశేఖర్, ఏఈ జయకృష్ణ పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో న్యాయవిజ్ఞాన సదస్సు


నస్పూర్ పీహెచ్‌సీ వద్ద మెడికల్ సిబ్బందితో జడ్జి ఉదయ్‌కుమార్

నస్పూర్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవా సంస్థ, జిల్లా ఆరోగ్య సంస్థల ఆధ్వర్యంలో నస్పూర్ పీహెచ్‌సీలో న్యాయ విజ్ఞాన సదస్సును శుక్రవారం నిర్వహించారు.ఈ సదస్సుకు సీనియర్ సివిల్ జడ్జి ఉదయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయ సేవా సంస్థల ద్వారా ప్రజలకు న్యాయ పరమైన సమస్యల పరిష్కారామే కాకుండా ప్రభుత్వం నుండి అందే పథకాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. అదే విధంగా ప్రభుత్వంలోని అన్ని శాఖల సమన్వయానికి సైతం కృషి చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సమత, సూపర్ వైజర్ దత్తు, ఆశా వర్కర్ల సంఘం జిల్లా కార్యదర్శి వాణి పాల్గొన్నారు.